


“[illegible] భోంచేసి కూడదు, బాబు,” అన్నాడు నారాయణ వంటింట్లో నుండి వస్తూ.

రంగు పెన్సిలుని కుర్చీ మీద వొదిలి, చేతులను పైకి జాపుతూ, అన్నాను “ఇంకొక్క ఐదు పేపర్లు దిద్దేస్తే....” వాక్యం పూర్తి చేసేలోగా పెద్ద ఆవలింత ముంచుకొని వచ్చింది

“ఇవ్వాల్టి కోటా పూర్తి అవుతుంది” అని ముగించేడు నారాయణ.

తొలిరోజు రాత్రి నేను ఒంటిగంట దాకా పడిగాపులు పడి అన్నరు పేపర్లు దిద్దుతూ వుండడం నారాయణ కనిపెట్టేడు. ‘రోజుకి యిన్ని పేపర్లు దిద్దుతాము’ అని మనస్సుతో తీర్మానించుకొని వుంటానని కూడ గ్రహించేడు. అదే నారాయణతో వున్న తమాషా.

“సినిమాకి వెళ్తానన్నావ్!

“అన్నాను, బాబు.”

“మరి వెళ్లవూ?”

“మీరు వెళ్లమంటే వెళ్తాను, బాబు.”

“వెళ్లు, వెళ్లు. టైం అయింది.”

నారాయణ వంటింట్లోకి వెళ్ళి రెండు జేబుల తెల్లచొక్కా ఒకటి వేసుకొని బయటికి వచ్చేడు.

ప్రొద్దుటి నుండి నన్ను వేధిస్తున్న ప్రశ్న గుర్తుకు రాగా అడిగేసేను, “నారాయణా, దెయ్యాలు ఉంటాయంటావా?”

“ఉంటాయి, బాబు.”

“నిన్న రాత్రి ఏమయిందో తెలుసా? ఇక్కడే వాకిట్లో కూర్చొని పేపరు దిద్దుతున్నానా? ఎక్కడి నుండో రెండు పెంకుముక్కలు వచ్చి నాకు గజం దూరంలో పడ్డాయిపోయి. ఇదివరకు కూడ అలా చాలా సార్లు జరిగింది. మన ప్రక్కింటి వాళ్లను అడుగుదూ వాళ్ల యింట్లో కూడ పడుతున్నాయేమోనని.”

“అడిగేను, బాబు,” అన్నాడు నారాయణ సవినయంగా “ఈ ఎక్కడి నుండో పెంకు ముక్కలు వచ్చిపడడం అన్నది రోజూ జరుగుతోంది, మరి అడక్కు,” అన్నాడండి వాళ్ల అబ్బాయి.”

“మన యింట్లో దెయ్యం ఒకటి తిరుగుతున్నాదన్నమాట.”

“అలా అనడానికి ఋజువేమీ లేదు బాబు. ఒక్కొక్క విషయం అలా ఎందుకు జరుగుతుంది అని అడిగితే సమాధానం చెప్పలేం.”

నాకు ధైర్యం చెప్పడానికి నారాయణ

ఇలా పాటు తిన్నాడని అనుకున్నాను. నేను రాకముందు ఆ యింట్లో వున్న కుటుంబీకుడు అకస్మాత్తుగా గుటుక్కుమన్నాడు. అతను పోవడం వల్లనే ఆ కుటుంబం యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయేరు కూడ. అతనే దెయ్యమయి తిరుగుతూ వుండవచ్చుని నా దృఢనమ్మకం.

“ఠికాణా అన్నావు. ఒరియా మాట కదూ?”

“అవును, బాబు. ఠికాణా అంటే...నమ్మకం.” నారాయణ వెళ్ళిపోయేడు.

ఒకగంటలో మూడు పేపర్లు దిద్దేసేను. అసలు, పేపర్లు యూనివర్సిటీకి చేరవలసిన గడువు తేది పదిరోజుల క్రితం దాటిపోయింది. నేను అంతవరకు వాటిని ముట్టుకోకపోవడం అన్నది కేవలం బి. వల్లనే. ఆ విషయంలో బలరామారావు మేష్టారు అభినందనీయుడు. గంపెడు సంసారం, బాధ్యతలతో వున్నా, గ. తే.కి పదిరోజుల ముందే పేపర్లు దిద్దేసి యూనివర్సిటీకి పంపించేసేడు.

వీధి తలుపు చప్పుడయింది. ఈ అర్ధరాత్రి వేళ ఎవరు వస్తారా అని ఆలోచించుకుంటూ వెళ్ళి తలుపు తీసేను. టెలిగ్రాఫ్ బంట్రోతు.

టెలిగ్రాంను చదివేను. గబగబా లోనికి వచ్చి కుర్చీలో కూలబడ్డాను. టెలిగ్రాంలో వ్రాసి వున్న విషయం యిది:

‘కాకినాడ

కుటుంబం రేపటి మెయిల్‌తో వస్తున్నారు రంగనాథ్.

* * *

సాధారణంగా అతిథులు యింటికి వస్తున్నారంటే కుర్చీల్లో కూలబడే మనిషిని కాను. నేను ఒంటరిగాణ్ణి కావడం వల్లనూ, నా యిల్లూ, హృదయం విశాలమైనవి కావడం వల్లనూ, ఎవరో ఒకళ్ళు బంధుత్వం కలుపుకుంటూ ఆత్మీయత ఒలకపోసుకుంటూ రావడం, కొన్ని పక్షాల పాటు వుండిపోవడం నాకు పరిపాటే.

రంగనాథ్ మా స్వంత మేనమామ. నేను యింటర్మీడియట్ వాళ్ళింట్లోనే వుండి చదువుకోవడం, నాకు అవసరం వున్నప్పుడు అతను ఐదూ, పదీ ముట్టచెప్పి వుండడం వల్ల, అతనికి నేను జీవితంలో ఎంతో ఋణపడి వున్నాను. అదీ కాకుండా, నేను ప్రస్తుతం వుంటున్న యింటికి యజమాని రంగనాథే. ఇల్లు (అద్దెకి)యిచ్చినప్పుడు పెట్టిన షరతుల్లో యిదొకటి: ‘మేం బరంపురం ఎప్పుడు వచ్చినా యీ యింట్లోనే దిగుతాం.’ వాళ్ళకు ఏఏ గదులు కేటాయించాలో కూడ ముందుగానే నిర్ణయించబడింది. కాబట్టి రంగనాథ్‌గారి కుటుంబం వస్తున్నారంటే నేను చతికిలపడడానికి పెద్ద కారణం వుండి వుండాలి...

ప్రతీ మానవుడికీ ఏదో ఒక లోపం వుండనే వుంటుంది. ఎవరో ఎత్తిపొడిచి చెప్పేదాకా తన బలహీనత గురించి అతనికి తెలియకపోవచ్చు. అప్పుడు ఆ లోపాల్ని సరిదిద్దుకోగలిగితే సరిదిద్దుకొని లేకుంటే తాత్కాలికంగా బాధపడి, రెండవ రోజు పూర్తిగా విస్మరిస్తాడు. కాని అతనిలో లేని లోపాలను అంటకడుతూ పరిహాసం చేసే వాళ్ళ తుస్థిప్తే?

అటువంటి వాళ్ళ కోవకి చెందిన వ్యక్తి రంగనాథ్ గారి మూడవ కూతురు వనజ. ఆమె పేరు తలుచుకొనే సరికి నాకు ఏవో అడవులూ, క్రూరమృగాలూ గుర్తుకు వస్తాయి. ఆమె దేవత రూపంలో కనిపించే ఒక రాక్షసి. ఆమెగారి ఆటుపోటులకు ఎవ్వరూ అతీతులు కారు.

నేను మామయ్య యింట్లో పది పన్నెండేళ్ళ క్రితం ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులలో ఆమె ఏడు—తొమ్మిది సంవత్సరాల పిల్ల. అందరి ఆడపిల్లల్లా క్రమేణా పెరుగుతూ, అందరినీ ఒక్కసారికి సొన్నవంలో మించేసింది.

క్రిందటి వేసవిలో ఆమె నా మీద పన్నిన కుట్రలు జన్మలో మరచిపోలేను. హైదరాబాదులో మా అన్నయ్య పెళ్ళికి వివిధ ప్రాంతాల నుండి స్నేహితులు, బంధువులు వచ్చేరు. వనజారాణి కూడ వాళ్ళ అమ్మతో సహా వచ్చింది. ఆడపెళ్ళివారు మగపెళ్ళివారితో హాస్యాలు ఆడడం అన్నది సాంప్రదాయకంగా ఒకరోజు అయితే, వనజాదేవి గారికి నాతో హాస్యాలు ఆడడం ఒకదిన చర్య.

ఒకసారి. అందరూ భోజనాలకి కూర్చోబోతూ వుంటే వనజ ఎక్కడి నుండో కేక వేసింది: “గోపాలా, నీ స్థలం యిక్కడ వుంది” అని ఆడవాళ్ళంతా కూర్చున్న వరుసని చూపించింది! నేను పేలవంగా నవ్వేసి ఊరుకున్నాను.

ఇంకొకసారి. భుక్తాయాసం తీర్చుకుంటూ కూర్చున్నారు అంతా. ఈమెగారు బహిరంగంగా ఒక ప్రకటన చేసింది. నేను చాలా బాగా పాడుతానని. పాటకి నాకూ ఎంత దూరమో ఆ భగవంతుడికి తెలియాలి. అక్కడ కూర్చున్న వాళ్ళకు తెలియునుగా ఒకటే బలవంతం చేసేరు! మరి తప్పక అక్కడి నుండి బయటికి వచ్చేసేను.

మూడవసారి. ఒకగుంపు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వనజ మాట్లాడుతోంది: “కొందరికి కొన్ని అక్షరాలు పలుకవు. ఉదాహరణకి గోపాల్‌కి ష అని పలుకదు.”

నాకు ఒళ్ళు మండిపోయింది. నాకు ఏ అక్షరం పలుకకపోవడం అంటూలేదు. అటువంటిది యీమెగారు ఒక అద్భుతమైన అబద్ధం కల్పించి ఎంత ధైర్యంగా చెబుతోంది!

“ష కి బదులు ఏమంటాడేం?” అని ప్రశ్నించింది ఒక అమ్మాయి.

“స అంటాడు. అది కూడ ఒక తమాషా అయిన యాసతో అంటాడు,” అంది వనజ.

అంతటితో చిన్నా, పెద్దా అంతా కలిసి నా మీద పడ్డారు. ష అనమని. పౌరుషంతో అనేసేను ‘స్స’. అందరూ గొల్లుమని నవ్వేరు.

వనజ చెప్పుకుపోతుంది— నేను కిళ్ళీలు ఎక్కువగా నములుతానని అందునుండి కొన్ని శబ్దాలు పలుకవని.

నాలుగవసారి. ఒక అమ్మాయిల గుంపు కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వనజ అందులో వుంది. నేను సీరియస్‌గా ఏదో పని మీద వెళ్ళిపోతూ వుంటే నాకు వినబడేటట్టుగా వనజ అంటోంది: “నేను పెళ్ళి అన్నది చేసుకుంటే, గోపాల్ లాంటి వాళ్ళతో మాత్రం చేసుకోను.”

నేను ఆగిపోయి నవ్వుతూ అన్నాను: “అసలు నిన్ను చేసుకోవడానికి సిద్ధంగా ఎవరున్నారు యిక్కడ?” నాకు ఆ అవకాశం కలిగినందుకు రెండురోజుల వరకు చాలా సంతోషించేను. ఆ సంతోషంలో ఆమె నన్ను పరిహాసం చేస్తున్నా పట్టించుకోలేదు..

అటువంటి వనజారాణి రేపు ప్రొద్దుటే రాబోతోంది! నా పేపర్లు దిద్దడమన్నది పెద్ద సున్నా!

ఒకటే ఆశ... ఆమె రాకపోయినా రాకపోవచ్చు.

* * *

పదకొండు గంటలయింది. స్నానం చేసి బయటికి వచ్చేసరికి వీధిలో రెండు రిక్షాలు ఆగి వుండడం గమనించేను. వచ్చిన వాళ్ళకి

స్వాగతం చెప్పడానికి మీరు అయినా మిగిలి వున్నారు.

అత్తయ్య, పదిహేడేళ్ళ కొడుకు బాబు మాత్రం వున్నారు. వనజ రాలేదు! ఆ పరమ సంతోషంతో అత్తయ్యని అడిగేను: "ఏం, అత్తయ్యా, బాగున్నావా?"

"ఆ" అని జవాబు చెప్పింది అత్తయ్య పొందాగా నవ్వుతూ.

"నిన్న అర్ధరాత్రి అందింది మీ టెలిగ్రాం. అప్పటికప్పుడు రెండుగదులు మీ కోసం ఖాళీ చేసి, శుభ్రపరిచేను," అన్నాను ఒక గదిలోకి ప్రవేశిస్తూ.

నేను విశ్వేష్టుడయ్యేను వనజ ఎదురుగా నిలబడి వుంది!

"ఏం, నేను రాకపోతే బాగుండునని అనుకున్నావా?" అంది వనజ నవ్వుతూ. వనజలో అంతటి పొగరుపోతుతనానికి కారణం ఆమె అందమేనని నాకు ప్రస్ఫుటమయింది.

"బాగుంది, నువ్వు వస్తే నాకేం?" అన్నాను.

"మీ వంటవాడు వున్నాడు కదూ" అని అడిగింది అత్తయ్య, లోనికి వస్తూ.

"ఉన్నాడు. కాఫీ త్రాగుతారా, లేక ఏకంగా భోజనం చేసేస్తారా?" అని అడిగేను. (ఈ ప్రశ్నకు చాలా అవార్థాలు తీసింది వనజ.)

భోజనాలయ్యేయి. నాకు నిద్ర ముంచుకొని రాగా పడుకున్నాను.. కళ్ళు తెరిచేసరికి, బాబు రేడియోని వేస్తున్నాడు. అదే తన స్వంత రేడియో అయితే వాడు ఆ విధంగా చస్తే తిప్పడు. ముల్లు సొవు అంగుళం కదిలేసరికి ఒక విమానం తల మీద నుండి వెళ్ళిపోతున్నట్టు శబ్దం వస్తోంది.

"వాల్యూం కొంచెం తగ్గించరా" అన్నాను. నా మాటలు వాడికి వినబడలేదు. నేను లేచి వెళ్ళి వాల్యూంని పూర్తిగా తగ్గించేసి, "సిలోన్ కోసమా?" అన్నాను.

కొంచెం ఆలోచించి, "ఆ" అన్నాడు బాబు.

"ఈ సెట్‌లో అంత బాగా రాదు."

"కాకినాడలో మా సెట్‌లో బాగా వస్తుంది."

"ఇది బరంపురం అయినా మరి," అన్నాను, యిప్పటిదాకా మాటలలో పైచెయ్యి నాదే నని సంతోషపడుతూ, కాని ఆ సంతోషం కాస్త జారిపోయింది.

"ఎందుకురా అనవసరంగా యింకొకళ్ళ

# నారాయణ చేసిన పరిష్కారం

రేడియో తిప్పుతావు?" అంటూ వనజ వచ్చింది రంగంలోకి.

"ఏదో బాగా వచ్చే స్టేషనులో తగు వాల్యూంలో వుంచితే ఏ బాధాలేదు."

"మరి ఏ స్టేషనూ రాకపోతే?"

"రేడియోని కట్టేయాలి."

"మరి దానికి లైసెన్సు కట్టడం దండుగ అన్నమాట."

"ఏదో ఒక స్టేషను రాకుండా పోదు."

వనజ విరగబడి నవ్వింది. "నాకేదో సామెత జ్ఞాపకం వస్తోంది. ఏమిటది—? ఏదో 'రుచి' అని వస్తుంది మధ్య" అని తమ్ముణ్ణి అడిగింది.

"అటుకుల రుచా?" అన్నాడు బాబు.

"ఆ. జ్ఞాపకం వచ్చింది. ఎద్దుకేం తెలుసురా అటుకుల రుచి?—అదీ సామెత."

"అంటే నేనొక ఎద్దునని మీ ఉద్దేశమా?"

"అబ్బే, అదికాదు. ఎద్దుకి అటుకుల రుచి తెలియనట్టే, నీకు తెలుగు పాటలలోని మజా తెలియదు," అంది వనజ నవ్వుతూ.

"అబ్బ, ఏమిటే ఎప్పుడూ ఆ విరగబడి నవ్వు!" అంటూ అత్తయ్య వచ్చింది. వనజ, బాబు వెళ్ళిపోయేరు. అత్తయ్య తెలుగు క్యాలండరు నా దగ్గర వున్నది పుచ్చుకొని వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనానంతరం నేను యథా ప్రకారం పేపర్లు దిద్దే నిమిత్తం వాకిలిలో కూర్చొని వున్నాను. పనిలో వున్నానని గుర్తించిన అత్తయ్య నా కాలాన్ని అట్టే వృథా పరచకూడదనే నిశ్చయాన్ని ముఖంలో కనబరుస్తూ, వచ్చి ఎదురుగా కూర్చుంది.

"మీ కాలేజీలో బలరామారావు మేస్టరని ఒకతను ఉన్నాడట. నీకు పరిచయం వుందా?"

"లేకేం, అతను తరుచు యిక్కడికి వస్తూ వుంటాడు. కూడ."

"మనిషి ఎటువంటి వాడు?"

"లావుపాటి శరీరం. ఎప్పుడూ మిల్లు ధోతి, కమీజు వేసుకుంటాడు. కళ్ళద్దాలలో నుండి ప్రతి వ్యక్తినీ, విషయాన్నీ తీక్షణంగా చూస్తాడు. ఆ చూపు, అతని మీసం అవతలి వాళ్ళకు కొంచెం భయం కలిగిస్తాయి. కాని మొత్తంమీద మనిషి మంచివాడే."

"ఒక విషయం చెప్తాను. ఊళ్ళో ఎవరి తోనూ అనకు. వనజ పెళ్ళి యీ ఏడాదిలో చేసేద్దామని అనుకుంటున్నాము. పెళ్ళి మాపులకనే వచ్చేం.

"కాని బలరామారావు మాస్టారికి కనీసం ఏభయి ఏళ్ళయినా వుంటాయి."

"అబ్బ, నువ్వొకడివి" అని గసిరింది అత్తయ్య. "అతని అబ్బాయి పెళ్ళికి ఉన్నాడట" అని కాస్సేపు ఆగి అంది: "అబ్బాయి మంచివాడేనని విన్నాం. రైల్వే ఉద్యోగం. నాలుగు వందలు దాకా వస్తా యట."

పెళ్ళిమాపులకి సాధారణంగా అబ్బాయి అమ్మాయి యింటికి వెళ్తాడన్న విషయం నాకు స్ఫురించింది. వనజ విషయంలో ఆ సాంప్రదాయం తారుమారు అయివుండవచ్చని తిరిగి సరిపెట్టుకున్నాను.

"మామూలుగా ఆ అబ్బాయి కాకినాడ రావలసి వుంటుంది" అత్తయ్య అంది. "కాని యిప్పట్లో సెలవు దొరకదట. ఈ ఊరు అయితే సులభంగా రాగలడని అన్నారు.. సంబంధం ముందర నిశ్చయం అయిపోతే" ఆఖరి మాటలు అంటున్నప్పుడు అత్తయ్య ముఖంలో ఆడవాళ్ళకు స్వభావ సిద్ధమైన చింత కనిపించింది.

"మామయ్య వస్తాడా?"

"మూడు వంతులు వస్తారు" అని ఆ సంశయాత్మక విషయాన్ని చర్చిండానికి అయిష్టం కనబరిచింది అత్తయ్య. ఒక నిమిషం అలా ఏదో ఆలోచిస్తూ కూర్చొని గదిలోకి వెళ్ళిపోయింది ఆమె.

నేను, నా పేపర్లు మిగిలేం. ఒక్కొక్క పేపరు నుండి ఒక్కొక్క విద్యార్థి తన మనస్తత్వాన్ని కనబరుస్తున్నాడు. అలా ఎనిమిది గురు విద్యార్థులు నా కళ్ళలో మెరిగి అంతర్ధానమయ్యేరు.

నాకు అరగజం దూరంలో మూడు పెంకు ముక్కలు పడి, తుళ్ళి, దగ్గరగా వున్న బాల్చీకి తగిలి, పెద్ద చప్పుడు చేసేయి. ఆ చప్పుడు కయినా యింట్లో వాళ్ళు లేస్తే బాగుండునని అనుకున్నాను. ఉన్న యీ ఒకటి, రెండు రోజులు వాళ్ళు లేచి చూస్తే మాత్రం ఏంలాభం అనిపించింది మరుక్షణానికి.

మళ్ళీ పేపర్లలో మునిగేను. ఒంటి గంట దాకా పనిచేసి, కోటా పూర్తి చేసి పడుకున్నాను.

* * *

ఉదయం నేను లేచేసరికి, ఆ రోజటి

పత్రిక మీద దిన్పైన్నా చెక్కుతున్నాడు బాబు. వాడి ప్రక్కనే వనజ కూర్చొని వుంది.

"ఒరేయి, ఒరేయి. ఆ పేపరు ప్రక్కింటి వాళ్ళదిరా" అని అరిచేను.

వనజ ముక్కు మీద వేలు వేసుకుంది. "తమరు ప్రక్కయింటి వాళ్ళ పేపర్ను చదువుతూ వుంటారన్నమాట" అని ఎగతాళిగా అంది.

"ఆ. తప్పేం?" నిజానికి నేను ఏ పేపరు తెప్పించనవసరం లేకుండా కాలేజీ లైబ్రరీకి సమస్తమైన పత్రికలూ వస్తాయి. సెలవు రోజులు కావడం వల్ల యిప్పుడు యింట్లో అవసరం వచ్చింది. ప్రక్కింటి అతను తనంతట తనే అన్నాడు: "మళ్ళీ మీరు కూడ పేపరు తెప్పించడం ఎందుకండీ? ఉదయం తొమ్మిది గంటలకి రోజూ మా నౌఖరీ వాడిచేత పంపిస్తాను. చదివేసి సాయంకాలం లోగా మళ్ళీ యిచ్చేయండి."

సలహా ఉత్తమమయిన దవడం వల్ల, నేను 'సరే' అన్నాను. ప్రత్యుపకారంగా వాళ్ళ కొళాయిలో నీళ్ళు రాని రోజున నారాయణ చేత నూతిలో నుండి నీళ్ళు తోడించి, వాళ్ళకు పంపిస్తూ వుంటాను. ఈ మా యిరుగుపొరుగుల పొత్తు వనజకేం తెలుసు?

"తప్పని ఎవరన్నారు? కాని స్వల్ప విషయాలకి యితరుల మీద ఆధారపడవలసిందా అని."

వ్యవహారం యథాప్రకారం ఎక్కడి నుంచో బయలుదేరి నాకు వ్యతిరేకంగా వచ్చింది.

"పోనీ, అది నా న్యూస్‌పేపరే అనుకో. అలా గీతలు పెట్టవచ్చునా?"

"పెన్ను సరిగ్గా వుందో లేదో చూసేను. అంతే" అన్నాడు బాబు, పత్రికను మేజా మీద పడేస్తూ.

వాడి చేతిలో నా పెన్ను గిలగిలా తన్నుకుంటోంది. ఆ దృశ్యం చూడలేక పెరట్లోకి వెళ్ళిపోయేను.

నేను తిరిగివచ్చేసరికి, వనజ, బాబు ప్రశాంతంగా కూర్చోవడం చూసి కొద్దిగా మురిసాను. ఎదురుగా కూర్చున్నాను. పేపరు తిరగవేస్తూ. వాళ్ళ రియాక్షన్ చూద్దామని అన్నాను "ఈ యింట్లో ఒక దెయ్యం తిరుగుతోందని నా గట్టి నమ్మకం."

బాబు నోరుపూర్తిగా విప్పేసి నావైపు చూడసాగేడు. వనజ నన్ను పరీక్షగా చూస్తూ "ఎందువల్ల?" అని అడిగింది.

# నారాయణ చేసిన పరిష్కారం

"రాత్రి పూటలు ఒక్కొక్కసారి పెంకు ముక్కలు ఎక్కడి నుంచో వచ్చి మీద పడుతూ వుంటాయి."

"నీ మీద పడ్డాయా?"

"ఆ. ఇదిగో కావలిస్తే చూడు. నిన్న రాత్రి ఒంటిగంటకి పడిన పెంకు ముక్కలను భద్రంగా దాచేను," అని వాకిలిలో ఒక స్తంభం దగ్గర పెట్టిన వాటిని చూపించేను.

వనజ పూర్తిగా నమ్మేసింది. "బాబోయి, దెయ్యమే," అంది.

"మన ప్రక్కింట్లో కూడ యిలా రోజూ పడుతూవుంటాయని అతను చెప్పేడు."

వనజ పరుగెత్తుకొని వెళ్ళి వాళ్ళ అమ్మతో చెప్పింది. అత్తయ్య కూడ వచ్చింది, "వూరుకోవే, నీపిచ్చి. వాడేదో తమాషాకి అంటూవుంటే," అని అనుకుంటూ.

"తమాషా కాదు, అత్తయ్యా. నిజంగానే," అన్నాను సీరియస్‌గా. "కావలిస్తే నారాయణని అడుగు."

నారాయణని వెంటనే పిలిచి అడిగేసేవాళ్ళే — అతను ఆవేళకి వుండివుంటే. కాని వాళ్ళ అన్నయ్యకి ఒంట్లో బాగులేదని ఆ రోజు ప్రొద్దుటే వండేసి వెళ్ళిపోయేడు.

అత్తయ్య ఏమీ మాట్లాడలేదు.

విషయం మార్చుదామని, "బాబు యీ సెప్టెంబరు పరీక్షకి కడతాడా?" అన్నాను.

"ఏమో వాడి చదువు విషయం ఒక పెద్ద బెంగ అయిపోయింది. పోనీ, యిక్కడ వున్న నాలుగు రోజులు వాడికి లెక్కలూ, అవీ చెబుదూ," అంది అత్తయ్య.

"వాడికి శ్రద్ధవుంటే నాకే అభ్యంతరమూ లేదు."

"శ్రద్ధ లేకేం," అన్నాడు బాబు కొద్దిగా నత్తితో. "లెక్కలెన్నే కష్టమవుతోంది."

"వూరికే కాలం వృథా చేయక, గోపాల్ దగ్గర రానివేవో నేర్చుకో" అని గట్టిగా అనేసి అత్తయ్య లోనికి వెళ్ళిపోయింది.

విషయం మార్చడం వల్ల అట్టే ప్రయోజనం లేకపోయింది. వనజ అంతసేపూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తూనేవుంది. బాబు కూడ ఆలోచనలో పడ్డాడు.

ఇద్దరూ రోజంతా అలికిడి లేకుండా కూర్చున్నారు. నేను నిరాటంకంగా పేపర్లు దిద్దుకున్నాను.

చీకటి పడుతున్నకొద్దీ వాళ్ళ ముఖాల్లో భయాందోళనలు ఎక్కువ కాసాగేయి. బాబు ఆంజనేయ దండకం జ్ఞాపకం ఉన్నంత వరకూ పదేపదే వల్లించుకుంటున్నట్టు కనబడ్డాడు.

బజారులో చిన్న పని చూసుకొని, ఒక అరగంటలో యింటికి తిరిగి వచ్చి, నా రేడియో గదిలోకి వెళ్ళేను.

వనజ వచ్చి గుమ్మం దగ్గర నిలుచుంది. ఆమెను చూసి నేను ఆశ్చర్యపోయేను— మునుపటి భయాందోళనలు ఆమెలో యిప్పుడు కొంచెమయినా లేవు.

"గోపాల్, ఒక ముఖ్య విషయం చెప్పాలి నీతో."

"ఏమిటి?"

"మరేంలేదు. ఆ పెంకులు పడడం అన్నది దెయ్యాల పనికాదు. మనుష్యుల పనే."

"అంటే?"

"చెప్తా విను. ఆ మనిషి యింకెవరో కాదు— ప్రక్కింటి అతడే."

"అతనా? పెంకులు విసిరితే అతనికేమి వచ్చింది?"

"నిజానికి అతను విసరడం లేదు. కొడుకు చేత విసిరిస్తున్నాడు."

"ఎందువల్ల అని?"

"దానికి కారణాలు చాలా వున్నాయి. వాళ్ళ కొళాయిలో నీళ్ళు రానప్పుడు మన యింటి బావిలో నుండి నీళ్ళు తీసుకుంటామంటే నువ్వు పనికిరాదన్నావట. అది మొదటి కోపం."

"అది చాలా పాత సంగతి. ఈ రెండు నెలలలో ఎప్పుడూ ఒద్దనలేదే."

"ఆ పాత సంగతి మీదే అతనికి యింకా కోపం వుంది. పైపైకిమాత్రం నీతో స్నేహంగా మాట్లాడుతూ వుండవచ్చు. రెండవ కారణం అతని కొడుకు మార్కుల విషయమై మీ తోటి లెక్చరరుతో ఒక మాట మాత్రం పారేయమంటే నువ్వు పారేయలేదట."

"అటువంటి పనులంటే నాకు అసహ్యం."

"అందుకే నువ్వంటే వాళ్ళకు ఒక రకమైన అసహ్యం. మూడవ కారణం — వాళ్ళ అమ్మాయి...."—

"వాళ్ళ అమ్మాయి?"

"వాళ్ళ అమ్మాయి వీధిలో నడుస్తూ వుంటే తదేకంగా చూస్తూ వుంటావట. ఒకసారి కేకలు కూడ వేసేవట."—

"కేక వేసిన సంగతి నాకు తెలియదు గాని, ప్రతి అమ్మాయిని చూస్తూ వుంటాను"

"ఇవి మూడు కారణాలు. ఇవేవీ లేక పోయినా, మామూలుగా ఒక పెద్ద సంసారం చిన్న యింట్లో వుంటూ, ఆ ప్రక్కనే ఒక బ్రహ్మచారి పెద్ద యింట్లో వున్నాడంటే, వాళ్ళకి ఈర్ష్య కలుగకమానదు," అని దృఢంగా చెప్పింది వనజ.

ఈ కారణాలు చెప్తున్నప్పుడు ఆమె ఎంతో అందంగా కనిపించింది.

"ఈ పొట్టి ఆయనకు ఫుట్బాడు బుద్ధులున్నాయన్నమాట" అన్నాను కర్కశంగా.

"గట్టిగా అనకు. వాళ్ళకు వినబడినా వినబడవచ్చు."

"ఇంతకీ యివన్నీ నీకెలా తెలిసాయి?"

"చాలా గమ్మత్తు చేసేనులే. మధ్య తలుపు లేదూ — ఒకసారి ఏమీ ఎరగనట్టు తీసేను. వాళ్ళ అబ్బాయి కూర్చొని వున్నాడు. వాళ్ళ అక్కయ్య ఉందా అని అడిగేను. లేదన్నాడు. మెల్లగా మాటలలో పెట్టి, నీ మీద ఉన్నవీ లేనివీ చాడీలు చెప్పేను. నాతో పూర్తిగా ఏకీభవిస్తూ అతను ఈ విషయాలన్నీ చెప్పేసేడు. అయినా పూర్తిగా కసి తీరడం లేదనీ, మంచి అవకాశం కోసం చూస్తున్నామని చెప్పేడు."

"వాళ్ళ మీద నీకు అనుమానం ఎలా వచ్చింది?"

"నువ్వు చెప్పిన మాటబట్టి, ఎక్కడి నుండో ఈ పెంకు ముక్కలు వచ్చి పడడం రోజూ జరుగుతున్నదే. మరి అడక్కు అని వాళ్ళ అబ్బాయి అన్నాడని చెప్పేవా? వాళ్ళింట్లో పెంకులు పడడం అన్నది నిజమయితే, అలా ఎవరైనా అంటారా? 'అవును, ఇక్కడ కూడ పడుతున్నాయి. ఆశ్చర్యంగా వుంది' అంటారు."

వనజని చాలా మెచ్చుకున్నాను. "ఇప్పుడు ఏం చేస్తే మంచిదంటావ్?"

"అదే ఆలోచించి చెప్తాను," అని అనేసి ఏదో సినిమా పాట పాడుకుంటూ వెళ్ళి పోయింది వనజ.


'మూర్ఖుడు' అని అనుకుంటూ


ఆనాటి నాటికి ఎంతో మంది గృహిణులు

# కాల్ గాస్

వంట పనిలో సుఖంకోసం వాడుచున్నారు





కాల్‌గాస్ మీ వంటగదిలో పెంచినప్పుడు, వంటపని ఎంత తేలికఅవుతుందో తెలిసికొంటే కాల్‌గాస్ వాడడం తేలిక ... వెంటనే మండుతుంది .... క్షణంలో వేడినిస్తుంది .... మీ వంటపని గంటలు చాలా తగ్గిపోతాయి.. ఖర్చు కూడా తక్కువే .... కాల్‌గాస్ శుభ్రమైనది .... పొగ, మసి చేరదు — పాత్రలు తోమడం తేలిక ...

## కాల్‌గాస్ సురక్షితమైనది

కాల్‌గాస్ సురక్షితమైన ఉక్కు సిలిండర్లలో ప్రత్యేక భద్రత గల మూతలతో వస్తుంది. గాస్ పోదు. తప్పుగా వాడేందుకు వీలులేదు.

ఇంటివద్దకే తెచ్చి ఇచ్చే ఏర్పాటు గలదు


కాలెక్స్ తయారు

సోల్ డిస్ట్రిబ్యూటర్లు : ఈస్ట్ కోస్ట్ గాస్ కంపెనీ

48/9/5 కో-ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్, విశాఖపట్నం-4. ఫోన్: 3518.

కన్నెమరా ఆనెక్సి, మౌంట్ రోడ్, మద్రాసు-2. ఫోన్: 83428.

క్రిందిచోట్లలో ఏజెంట్లు గలరు. * విశాఖపట్నం * మద్రాసు * విజయవాడ * కాకినాడ * ఏలూరు * గుంటూరు * కటక్ * రాజమండ్రి * నెల్లూరు * గూడూరు (నెల్లూరు జిల్లా) * తిరుపతి * బర్హాంపూరు * పాలకొల్లు * విజయనగరం * మచిలీపట్నం * కొట్టాడ * సేలం * పాండిచ్చేరి * ఒంగోలు * గుర్కు * వరంగల్ * కాంచీపురం * భువనేశ్వర్.



ఇదీ ఈగ
ఇదే ఈగల సంహారిణి
ఎఱ్ఱని టిన్నులోని ఫ్లిట్...
ఈగలను, దోమలను మరియు అన్ని ఇతర
క్రిమి కీటకాలను చంపుతుంది.
ఫ్లిట్
మీ గృహ సంరక్షణ చేసుకోండి...
ప్రపంచంలో అగ్రగామియయిన
కీటక సంహారిణి!
CMEF—11 TL

వాడుటకు సిద్ధముగా నుండు
కేశవర్ధిని
రెడిమిక్స్‌డ్ హేర్ ఆయిల్
కొనండి.


అన్ని స్టోర్లలో లభించును.
కేశవర్ధిని ప్రొడెక్ట్సు
మద్రాసు—14.

# నారాయణ చేసిన పరిష్కారం

మంచం మీద వ్రాలేను.

వనజ నిమిషంలో తిరిగి వచ్చి, "జాగ్రత్తగా విను," అని చెప్పనారంభించింది. "ఒకానొక పట్నాయక్‌కి పొరుగింటి పాఢి మీద ఏదో కక్ష వుండేదట. అప్పుడు పాములూ, తేళ్ళూ తీసుకొని వచ్చి పాఢి యింట్లో వదిలి పెట్టేవాడట. ఆ బాధ భరించలేక పాఢి రెండవ రోజునే యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయేడట. పట్నాయక్‌లా నువ్వు మాత్రం చేయలేవా?"

"ఎందుకు చేయలేను, వీళ్లను అల్లరి చేయాలంటే ఎంత సేపు?"

"రైట్. ఈ ఆలోచన నాది కాదు సుమా. అమ్మ చెప్పింది."

నేను ఆశ్చర్యపోయేను. తిన్నగా వెళ్లి అత్తయ్యని "అవునా?" అని అడిగేను. "ఆ" అంది అత్తయ్య సీరియస్‌గా. "వాళ్ళు నీ మీద అంత పగ బూనినపుడు, ఆత్మరక్షణ కోసం నువ్వేం చేసినా తప్పు లేదు."

ఇక కార్యాన్ని అమలు పరచడమే తరువాయి. కాని ఎలా? నారాయణ రాత్రిలోగా వచ్చేస్తే బాగుండును. అతనికి తెలియని విషయం, కానిపని అంటూ లేదు. ముఖ్యంగా నా కోసం ఏం చేయమన్నా చేస్తాడు. కాబట్టి నారాయణ రావడమే తరువాయి.

ఆశించిన విధంగా నారాయణ వచ్చేడు.

"నారాయణా, నీ వంటపని యీ పూటకి తప్పి పోయింది కాని, యింకొక అర్జంటు పని తగిలిందోయి."

"ఏమిటి, బాబు?"

ఆరోజు వనజ ప్రక్కింటి వాళ్ళ నుండి తీసిన కూపీ విశదంగా చెప్పి, "పాములూ, తేళ్ళూ తీసుకొని వచ్చే పూచీ నీది," అని ముగించేను.

నారాయణ ముఖం చిట్లించుకున్నాడు.

"ఏంవోయి, నీకీ ఆలోచన నచ్చలేదా?"

"ఈ ఆలోచన పనిచేయదు, బాబు."

"తొల్లి పట్నాయక్ — పాఢి విషయంలో పని చేసింది."

"అవ్వచ్చు. కాని మన విషయంలో పని చేస్తుందని నమ్మకమేమిటి? ఎక్కడో ఒక చోట వప్పులో కాలు వేయడం అవుతుంది."

నారాయణ యొక్క విముఖత నాకు చాలా బాధ కలిగించింది. "మరేం చెయ్యడమో చెప్పు పోనీ," అన్నాను.

"నిజమైన దెయ్యాలు కొనండుకు సంతోషించండి."

మరి లాభం లేదనుకొని, ప్రసంగాన్ని అక్కడితో వదిలేసేను.

ఆ రోజు రాత్రి నేను, వనజ, బాబు డాబా ఎక్కి నక్కి నక్కి చూస్తున్నాం. మా డాబా చివరి నుండి ప్రక్క యిల్లంతా చక్కగా కనిపిస్తుంది. ఏదైనా అలజడి అవుతుందేమోనని చూస్తున్నాం. ఒంటి గంట దాటిపోయింది.

"ఆ శుంఠకి యివ్వాళ చక్కగా నిద్ర పట్టిపోయి వుంటుంది," అన్నాను.

మెల్లగా మాట్లాడమని సంజ్ఞ చేసింది వనజ.

"నాకేమిటి భయం?" అన్నాను.

పెద్ద చప్పుడయింది. ఏమిటా అని చూసే సరికి, బాబు పెద్ద పెంకు ముక్కలను చేతితో పట్టుకొని వున్నాడు. ఒకసారి నా వైపు చూసి నవ్వేసి, తపీ తపీమని నాలుగు ముక్కలను విసిరేసేడు.

సంతోషం, భయం మా ప్రతీ ఒక్కరిలో యుద్ధం చేస్తూ వుండగా, గబగబా క్రిందికి వచ్చేసి, ఎవరి పక్కల మీద వాళ్ళం పడుకున్నాం.

*  *

ఆ రోజు మంగళవారం. సాయంకాలం ఆరు గంటలకి అబ్బాయి వస్తాడు అమ్మాయిని చూడడానికి.

వకాలమయ్య రాలేకపోయేడే అని దిగులు పడుతున్నా, ఆ పరిస్థితికి మనస్సును అలవాటు పరచుకున్నందువల్ల సంబాళించుకొంది అత్తయ్య. వాళ్ళ అన్నయ్యని వదినని ఆ సమయానికి సాయంగా రమ్మని యిదివరకే ఆహ్వానించింది.—

నా దృక్పథంలో చూస్తే, నాకు సంతోషంగా వుంది — కాలేజీలో, చాలా మర్యాదగా ఎన్నిక అయ్యే సీనియర్ లెక్చరర్ మా యింటికి కేవలం చదువు దృష్ట్యా కాక వియ్యానికి వస్తున్నాడంటే విచిత్రంగా తోచింది.

వనజ యథాప్రకారం ఫ్రీగా వుంది. బాబు ఉబుసుపోక పాటలు పాడుతూ, బొమ్మలు గీస్తూ, రేడియో తిప్పుతూ వున్నాడు.

సాయంకాలం తానే వచ్చింది.

అత్తయ్యా వాళ్ల అన్నయ్యా వదినలు ముందు వచ్చేరు. హాలులో కుర్చీల్లో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. వాళ్లతో టైట్‌గా కూర్చున్నాం నేనూ, బాబు. అత్తయ్య ఒక చోట కూర్చోలేక యిటూ అటూ తిరుగుతోంది. వనజ ముస్తాబయి రేడియో గదిలో కూర్చొని ఏదో పుస్తకం తిరగవేస్తోంది.

అబ్బాయి, అబ్బాయి తండ్రి సదరు బలరామారావు మాస్టారు, అతని భార్య వచ్చేరు. తగు విధంగా ఆహ్వానించి వాళ్ళని కూర్చోబెట్టేం.

మాస్టారు నన్ను పలుకరిస్తూ, "పేపర్లు పంపించేసేవా లేదోయ్?" అన్నాడు.

"లేదండి, ఇంకా నాలుగు రోజుల పనయినా మిగిలివుంది."

అమ్మాయి రావడం, అబ్బాయి అమ్మాయిని చూడడం, అమ్మాయి అబ్బాయిని చూడడం జరిగేయి. అమ్మాయిని పాట పాడమన్నారు. చక్కగా పాడింది.

కాఫీ తీసుకొని వచ్చి అందరికీ యిచ్చింది వనజ. అందరూ త్రాగడానికి ఉపక్రమించేరు.

ఉన్నట్టుండి నాకు ఒక భ్రాంతి కలిగింది — ఎదురుగా మా ప్రక్కింటి పొట్టి అతను కనిపించేడు. ఒక చేతిలో ఖడ్గం, రెండవ చేతిలో విల్లు, మూడవ చేతిలో గొడ్డలి, నాలుగవ చేతిలో యుద్ధక్షుర పట్టుకొని వున్నాడు....

నా చేతిలోవున్న కప్పు తుఫానులో యింటి కప్పులా ఎగిరింది. వెళ్లి వెళ్లి మా మాస్టారి ఒళ్లో పడింది.

"వాట్ యీజ్ రాంగ్ విత్ యు?" అని గర్జించేడు మాస్టారు.

"ఐ యాం సారీ," అంటూ లోనికి వెళ్లి ఒక తువాలును తీసుకొనివచ్చి యిచ్చేను, చేతులు యింకా వణుకుతూనే వున్నాయి.

ధైర్యం చిక్కబెట్టుకొని, ఆ భయంకర రూపం వైపు మళ్లీ చూసేను. నేను లేచిన కుర్చీలో కూర్చొని వున్నాడు అతడు.

"ఇరుగు పొరుగు వారు కాబట్టి పరిచయం చేయవలసిన అవసరం లేదనుకుంటాను," అన్నాడు మాస్టారు.

"హ" అని నవ్వేను.

"గోపాలకృష్ణ గారూ, మిమ్మల్ని ఏదో విషయం బాధ పెడుతోంది. ఒంట్లో బాగులేదా?"

"ప్రొద్దుటి నుండి జ్వరం. రోజంతా అలా డల్‌గానే వున్నాడు," అంది అత్తయ్య.

లాభం లేదనుకొని, "మన్నించండి," అని చెప్పి, నా పడక గదిలోకి వచ్చి, మంచం మీద వ్రాలేను.

ఆ పొట్టి అతను ఎందుకు వచ్చేడు? నిన్న బాబు చేసిన అఘాయిత్యాన్ని గురించే అయివుండాలి. అన్ని ఆయుధాలతో వచ్చిన వాడు వూరికినే ఎందుకు కూర్చున్నాడు?.. అసలు బాబు నిజంగా ఒక వెధవ! వాళ్ళు నిజంగా పెంకులు విసురుతున్నారా లేదా అని చూద్దామంటే గొప్పగా తను బండెడు రాళ్ళు తీసిపోసేడు వాళ్ల మీద! ఒక వేళ వాళ్ళు అమాయకులయితే?... ఏది కాని పెద్ద రభస కానున్నది. పెళ్లివారు వున్నప్పుడే జరిగేటట్టుంది.

వనజ లోనికి వచ్చింది. "భయపడుతున్నావా, గోపాల్?" అంది నవ్వుతూ.

"నీకా తమ్ముడు చేసిన ఘన కార్యానికి."

"కాని ఆ గొడవేమీ యిప్పుడు లేదుగా. ఆ పొట్టి అతను యిప్పుడు పెళ్లి పెద్దగా వచ్చేడు."

"పొట్టి పెద్ద ఏమిటి?"

వనజ నవ్వు ఆపుకోలేకపోయింది. "జరిగిందంతా చెప్తా విను. మధ్యాహ్నం నువ్వు దీర్ఘంగా పడుకొని వున్నప్పుడు అతడు రానే వచ్చేడు — నువ్వు వూహించిన రూపంలో. పెద్దగా కేకలు వేస్తూ వచ్చేడు. 'ఈ యింట్లో అతనికి ఏమయినా బుద్ధుంటూ వుందా? ఏడీ ఆ మాస్టారు?' అని విజృంభించేడు. నువ్వు గాఢంగా నిద్రపోతున్నావు. బాబు నిద్ర నటిస్తున్నాడు. అప్పుడు నారాయణ వచ్చి చిక్కు విడదీసేడు."

"నారాయణా?"




"ఆ. ఆ పెంకులు విసరడం మా(ట) నిజమే, కాని అప్పుడు నువ్వు తెలివిత(ప్పి) లేవని చెప్పమన్నాడు నారాయణ. అమ్మ అలాగే చెప్పింది."

"అంటే నమ్మేసేడా?"—

"తెలివి ఎక్కువకి పోయింది అని అ(న్నా)గేడు. నువ్వు ఆ సమయంలో బాబు లెక్కలు చెప్తున్నావనీ, ఏదైనా విషయ(ం) బోధపరుస్తున్నప్పుడు చేతిలో ఏదివుం(టే) అది విసిరేయడం నీకు అలవాటు అ(ని) చెప్పింది అమ్మ."

"ఇంతకీ రాళ్ళు రువ్వేది అతనయి(తే) నేను విసరగానే అంత ఉక్రోషం రావాలేం?"

వనజ నవ్వసాగింది. "నువ్వు నిజం పిచ్చివాడివి. అసలు పెంకులు ఎక్క(డి) నుంచో పడడం లేదు. నువ్వు యింటి(ని) ఎలా వుంచేవో ఒకసారి ఆలోచించు."

అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది... ఇల్లు శిథిలావస్థలో కనబడడం యిష్ట(ం) లేక, ఒకరోజు సగం విరిగిన పెంకులన్నిటి(నీ) యింటి కప్పుమీద నుండి పూడవికి క్రింద తీసుకొని వచ్చేను. వాటిని [illegible] అన్యాయం చేసిన వాడినవుతానని భద్రంగా వాకిలి ప్రక్కన రెండు స్తంభాల మధ్య వున్న దూలంమీద అమర్చిపెట్టే(ను). ఆ దూలం ఎలుకలకి రహదారి....

వనజ వెళ్లిపోయింది.

నారాయణ వచ్చి నన్ను తదేకం చూస్తూ నిలబడ్డాడు.

"నారాయణా"

"ఏం, బాబూ?"

"నన్ను పిచ్చివాడిని చేసింది ను(వ్వు) అన్నమాట."

"పరిస్థితి అలా వచ్చింది, బాబూ. బా(బు) విసిరేడని చెప్తే, వనజమ్మగారి పెళ్లి(కి) అడ్డంకులు రావచ్చని అలా చెప్పమన్నా(ను) బాబూ. పొట్టి అతను వాళ్ళకు దగ్(గర) బంధువాయె మరి."

నేను నిట్టూర్చేను.

నేను యింటర్మీడియట్ మామ(య్య) యింట్లోనే వుండి చదువుకోవడం, అవస(రం) ఉన్నప్పుడు అతను నాకు ఐదూ, పదీ ము(ట్ట)చెప్పి వుండడంవల్ల నేను అతనికి ప(డ్డ) ఋణాన్ని యిలా తీర్చుకున్నానని తృ(ప్తి) పడ్డాను. ●